# మంచి సినిమాలకు మంచి కాలం : శ్రీనివాస్ అవసరాల



ఆస్టిన్ : మంచి లక్ష్యం, మంచి ప్రతిభ వుంటే తెలుగు సినిమా రంగంలో మంచి విలువల్ని తీసుకు రావచ్చని, ఇప్పుడు వున్న వాతావరణంలో తెలుగులో కొత్త తరం దర్శకులు ఇవి సాధించగలుగుతున్నారని నటుడు అవసరాల శ్రీనివాస్ అన్నారు. ఆస్టిన్ లోని టెక్సస్ విశ్వవిద్యాలయంలో తానా సహకారంతో తెలుగు విద్యార్థుల సమాఖ్య నిర్వహిస్తున్న తెలుగు సినిమా వసంతం ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సెమిస్టర్ అంతా జరిగే తెలుగు సినిమా వసంతంలో తెలుగు సినిమా చరిత్రలో ఆణిముత్యాల్లాంటి అనేక చిత్రాలని ప్రదర్శించబోతున్నారు. శుక్రవారం నాడు జరిగిన ప్రారంభ సభకి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, టెక్సస్ లోని వివిధ రాష్ట్రాల నించి తెలుగు సంఘాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ అవసరాల ప్రధాన పాత్ర పోషించిన "అష్టా చమ్మా" చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈ చిత్రంపై జరిగిన చర్చలో శ్రీనివాస్ అవసరాల మాట్లాడారు. సినిమా నిర్మాణం, కథ, నటన, సాంకేతిక అంశాల మీద ఆసక్తికరమయిన చర్చ జరిగింది.

తెలుగు సినిమా ఇప్పుడు గొప్ప మలుపులో వుందని, నిజ జీవితానికి దగ్గిరగా వుండేట్టుగా చిత్రాలు వుండాలన్న సంకల్పం కొత్త తరం దర్శకులలో వుందని ఆయన అన్నారు. ఈ చిత్రంలో నటించడం తనకి గొప్ప అనుభవమని, మరచిపోలేని సినిమా పాఠమని ఆయన అన్నారు.

తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే ఏ ప్రయత్నమయినా ప్రస్తుత పరిస్థితుల్లో ఆహ్వానించదగిన చర్య అని, ఈ దిశగా టెక్సస్ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా సంస్కృతుల విస్తరణలో తానా చేస్తున్న కృషి హర్షణీయమని ఆయన అన్నారు. ఆస్టిన్ తెలుగు కార్యక్రమం భాషకే పరిమితం కాకుండా, ఈ తరం తెలుగు విద్యార్థులలో సంస్కృతి పట్ల అభిరుచి పెంచడానికి దోహద పడుతోందని 'తానా' కార్యదర్శి, ఆస్టిన్ తెలుగు కార్యక్రమ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ప్రసాద్ తోటకూర చెప్పారు. తెలుగుని ఒక భాషగానే కాకుండా ఒక సాంస్కృతిక రంగంగా భావించి, ఆ భాషని అధ్యయనం చెయ్యాల్సిన అవసరం వుందని వివరిస్తూ తెలుగు విద్యార్థి బ్రైస్ రాబిన్సన్ ఆసక్తికరమయిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

ఆస్టిన్ – టెక్సస్ తెలుగు విద్యార్థుల సమాఖ్య అధ్యక్షు రాలు దీపికా ముత్యాల, ఉపాధ్యక్షు రాలు దివ్య యలమంచిలి తెలుగు సమాఖ్య కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సమాఖ్యలో అనుపమ అట్లూరు, ప్రియా కుమార్ ఎలిజబెత్ , రంజనీ దావలాత్ , హర్ష ఓరుగంటి, నవీన్ చల్లపల్లి, బ్రైస్ రాబిన్సన్ , మనోజ్ మిక్కిలినేని కార్యవర్గ సభ్యులు. ప్రసాద్ తోటకూర, కోనేరు ఆంజనేయులు, ముత్యాల పద్మశ్రీ, వై.వి. రావు, ఎస్ . ఎస్ . రావు, అనంత్ బొబ్బిలి, మాధవరావు గోవిందరాజు, డాక్టర్ అఫ్సర్ , రామ్ యలమంచిలి గౌరవ సలహా దారులు. శుక్రవారం జరిగిన తెలుగు సినిమా వసంతం వేడుకల్లో వీరంతా పాల్గొనడం కార్యక్రమానికి కొత్త శోభనిచ్చింది. వారితో పాటు రాంకీ చేబ్రోలు, మురళి వెన్నం, పులిగండ్ల విశ్వనాథం, .సి. ఆర్ . రావు, ఎ. మురళి, రాజా ముత్యాల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.